సాక్షి
కుమురం భీం
మంగళవారం ; 8 ; జూలై ; 2025



రుయ్యాడిలో ముగిసిన మొహర్రం

ఆదిలాబాద్ జిల్లా రుయ్యాడిలోని హస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో మొహర్రం వేడుకలు ముగిశాయి. భక్తులతో దేవస్థానం కిక్కిరిసి పోయింది.

8లో▸



చీఫ్ సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు.

గరిష్ఠం/కనిష్ఠం
26.3 /24.2

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా అనిల్‌యాదవ్



అనిల్ యాదవ్

కైలాస్‌నగర్: క్షేత్రస్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను నియమించిన టీపీసీసీ.. తాజాగా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీలను నియమించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌కు రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే రంగంలోకి దిగి గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ కమిటీల నియామక ప్రక్రియ పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ పటిష్టతపై అధిష్టానం దృష్టి సారించడంపై శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మరోవైపు అనిల్ కుమార్ ఈ వారంలోనే జిల్లా పర్యటనకు రానున్నట్లుగా సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: జిల్లాలోని కేజీబీవీలు, యూఆర్‌ఎస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు ఒప్పంద పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో రెండు ఏఎన్‌ఎం, మూడు అకౌంటెంట్ పోస్టులకు మహిళా అభ్యర్థులు, యూఆర్‌ఎస్‌లో అసిస్టెంట్ కుక్, నైట్ వాచ్‌మెన్, డే వాచ్‌మెన్ పోస్టులకు పురుష/మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల వయస్సులోపు వారు ఈ నెల 9 నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

10న ఇంటర్వ్యూలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల కళాశాల/పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల నియామకాలకు ఈ నెల 10న డెమో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు జేఎల్(జనరల్) టీజీటీ పీజీటీ (జనరల్), హిందీ పీటీజీ(మహిళ), ఇంగ్లిష్ పీటీజీ(జనరల్), జేఎల్(జనరల్), మ్యాథ్స్ (జనరల్ మహిళ- 1), (జనరల్- 1), ఫిజిక్స్ పీజీటీ(మహిళ- 1), కెమిస్ట్రీ(జనరల్- 1) సబ్జెక్టులు బోధించేందుకు పోస్టు గ్రాడ్యుయేషన్, బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట్ బాలుర పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాకు విద్యార్హతల జిరాక్స్ పత్రాలు జతపరిచి, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

ఎస్పీఎంలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ పేపరు మిల్లులో స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిరుద్యోగ యువకులు, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం అదనపు కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మిల్లు ప్రతినిధులకు వేర్వేరుగా వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 2018లో మిల్లు పునఃప్రారంభంలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి, ఇప్పుడు యాజమాన్యం ఇతర ప్రాంతాల వారికి అవకాశం కల్పిస్తుందని ఆరోపించారు. స్థానిక నిరుద్యోగులు జీవనోపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు కల్పించినా ఎస్పీఎం యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు రమేశ్, ముజాములిద్దీన్, శ్రీనివాస్, ఎన్నం శ్రీకాంత్, ఎండీ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు కొత్తరూపు!

- ‘హామ్’ పథకం కింద జిల్లా రోడ్లకు మహర్దశ
- తొలిదశలో 308.13 కిలోమీటర్ల వరకు అభివృద్ధి
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖలు
- డీపీఆర్ రూపకల్పనకు రంగంలోకి దిగిన కన్సల్టెన్సీ సంస్థ



హామ్ పథకంలో భాగంగా విస్తరించనున్న ఉట్నూర్- ఆసిఫాబాద్ రహదారి

సాక్షి, ఆసిఫాబాద్: అడుగు లోతు గుంతలు.. కంకర తేలిన రహదారులు.. ఇదీ జిల్లాలోని చాలా మార్గాల్లో రోడ్ల పరిస్థితి. త్వరలో ఈ రహదారులకు మహర్దశ పట్టనుంది. ‘హామ్’(హైబ్రిడ్ యాన్యుటీ మోడ్) పథకంతో గుంతలు, కంకర తేలిన రహదారులు సరికొత్త రూపుదిద్దుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ పథకంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తొలిదశలో భాగంగా 308.13 కిలోమీటర్ల పొడవైన పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. వాటికి సంబంధించిన పనులను సర్వే చేసి డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్(డీపీఆర్) రూపకల్పన కోసం ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ సంస్థకు సర్కారు అప్పగించినట్లు తెలుస్తోంది. సదరు డీపీఆర్ ఆధారంగా సింగిల్ లేన్ రహదారులను రెండు లేన్లు, కంకర రోడ్లను తారు రోడ్లుగా మార్చనున్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారులు అప్‌గ్రేడ్..

జిల్లా పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలిదశలో భాగంగా 308.13 కిలోమీటర్ల పొడవున ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లను నూతనంగా నిర్మించనున్నారు. కిలోమీటరు సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో నెలరోజుల్లో టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభించనున్నట్లు తెలిసింది. జిల్లా రహదారులు, భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ) పరిధిలో మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, మండల కేంద్రం నుంచి మండల కేంద్రానికి, గ్రామం నుంచి మండల కేంద్రానికి రహదారులను విస్తరించనున్నారు. మూడు విభాగాల్లో ఇప్పుడున్న రహదారులను రెండు, నాలుగు లేన్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. జిల్లా పరిధిలోని 122.3 కిలోమీటర్ల పొడవున రహదారులను నవీకరించనున్నారు. ఇందులో ఉట్నూర్- ఆసిఫాబాద్ 68 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.68 కోట్లు వెచ్చించనున్నారు. అలాగే ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్(టి) 28.8కిలోమీటర్ల పొడవున ఉన్న రోడ్డు కోసం సుమారు రూ.29 కోట్లు, సిర్పూర్- మకోడి మార్గంలో 10.5 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.11 కోట్ల వరకు, కల్వడ- వడ్డుగూడ 15 కిలోమీటర్ల రహదారి పనులకు రూ.15 కోట్లు వ్యయం కానుంది.

పంచాయతీ రోడ్ల అభివృద్ధి ఇలా..

ఇక జిల్లాలో పంచాయతీరాజ్ మంచిర్యాల సర్కిల్ పరిధిలో వచ్చే రహదారుల విషయానికి వస్తే.. ఈ రహదారులను మూడు దశల్లో అభివృద్ధి చేయడానికి అధికారులు కసరత్తు చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. మొత్తం మూడుదశల్లో 139 రహదారులను 633.90 కిలోమీటర్ల పొడవుతో నూతనంగా నిర్మించడానికి ప్రతిపాదించారు. తొలిదశలో భాగంగా ఆసిఫాబాద్, సిర్పూర్ (టి) నియోజకవర్గాల పరిధిలోని 34 రోడ్లకు సంబంధించి 185.83 కిలో మీటర్ల పొడవున రహదారులు నిర్మించనున్నారు. ఇందులో ప్రధానంగా వీపీపీ రోడ్డు నుంచి బహ్లన్‌పూర్ వరకు 22 కిలోమీటర్ల రహదారిని నవీకరించనున్నారు. అలాగే దాంపూర్ నుంచి అర్జున్‌లొద్ది వయా గిన్నెధరి, గాడలపల్లి రహదారిలో 13.4 కిలోమీటర్ల రహదారిని నిర్మించనున్నారు. రెండోదశలో 44 రహదారుల్లో 224.20 కిలోమీటర్ల వరకు, ఆ తర్వాత మూడో దశలో 61 రహదారుల్లోని 223.80 కిలోమీట్లర పొడవున రోడ్లు నవీకరించనున్నారు.

మూడు దశల్లో అభివృద్ధి

జిల్లా పరిధిలో ‘హామ్’ పథకం కింద మొదటిదశలో 185.83 కిలోమీటర్ల పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రహదారులను అప్‌గ్రేడ్ చేయనున్నాం. మొత్తం మూడు దశల్లో 139 మార్గాల్లో 633.90 కిలోమీటర్ల వరకు నూతన రహదారులను నిర్మించనున్నాం. ‘హామ్’ పథకంతో జిల్లాలోని రహదారులు కొత్తరూపు సంతరించుకోనున్నాయి.

– అజ్మీరా కృష్ణ, పీఆర్ ఎస్‌ఈ

18 వరకు ఇందిరా మహిళా శక్తి సంబురాలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో ఈ నెల 18 వరకు ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, సెర్ప్ ఏపీఎంలు, డీపీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 వరకు ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించేందుకు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 8వ తేదీన ప్రతీ మండలంలో మండల సమాఖ్య సభ్యులు, 9న గ్రామ సమాఖ్య సభ్యులతో సమీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సభ్యులు ప్రమాదవశాత్తు చనిపోతే ప్రమాదబీమా, రుణబీమా వర్తింపజేస్తుందన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, సోలార్‌ప్లాంట్లు, పెట్రోల్ పంపులు, చేపల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, పాల డెయిరీలను ఏర్పాటు చేస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో మహిళా శక్తి భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 22 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వడ్లు కొనుగోలు చేయగా, రూ.20 లక్షల కమీషన్ వచ్చిందని వెల్లడించారు. 446 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో రూ.7.82 కోట్లతో పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఏకరూప దుస్తులు అందించడంలో మహిళా సంఘాల కృషి అభినందనీయమన్నారు. సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, కార్యదర్శి వనిత, కోశాధికారి కుసుమ, గౌరవ అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఆసిఫాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్‌డీవో దత్తారావు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణ, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అనుకూలమైన వాతావరణం ఉందని తెలిపారు.



కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, తదితరులు

మత్తుకు బానిస కావొద్దు

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కాగజ్‌నగర్‌రూరల్: యువత మత్తుకు బానిస కావొద్దని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం బురదగూడ గ్రామంలో సోమవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు ప్రజలు, యువత, విద్యార్థులు సహకరించాలని కోరారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల బారినపడి యువత జీవితాలు కోల్పోతున్నారన్నారు. ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని, వాటిని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి, చెడులు వివరించి, క్రమశిక్షణ నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్భయంగా సేవలు వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్: జిల్లా ప్రజలు నిర్భయంగా పోలీసుల సేవలు వినియోగించుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిస్థితి, పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీస్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. చట్టప్రకారం సమస్యలు పరిష్కరించేందుకు పోలీసులు పనిచేస్తారని తెలిపారు.



బురదగూడలో అవగాహన కల్పిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

సార్వత్రిక సమ్మెకు దూరంగా ఉండాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి పరిధిలో పరిష్కరించే డిమాండ్లు లేనందున ఈ నెల 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంస్థ ఉద్యోగులు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాలు ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వగా, ఈ సమ్మెలో అధికశాతం డిమాండ్లతో సింగరేణి కార్మికులకు ఏ మాత్రం సంబంధం లేదని తెలిపారు. సంస్థ పరిధిలో లేని సమస్యల కోసం సమ్మెకు వెళ్లడం సరికాదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తితోపాటు ఓబీ వెలికితీతలో వివిధ కారణాలతో వెనుకబడి ఉన్నామని పేర్కొన్నారు. జూలై, ఆగస్టులో వర్షాల ప్రభావంతో ఓసీపీల్లో ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలగనుందని, వార్షిక లక్ష్య సాధనకు కార్మికులు సహకరించాలని కోరారు. సింగరేణి సంస్థలో ఒక రోజు రూ.76 కోట్ల ఉత్పత్తి జరుగుతుందని, కార్మికులు వేతనాల రూపంలో రూ.13.07 కోట్లు నష్టపోతారని ఆయన తెలిపారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీవైపీఎం రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

సమస్యల వెల్లువ

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అర్జీలు స్వీకరించి బాధితులకు భరోసా కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కాగజ్‌నగర్ మండలం అందవెల్లికి చెందిన జెల్లా వాణి, చింతలమానెపల్లి మండలం బాబాపూర్‌కు చెందిన పుణ్యపురెడ్డి కవిత, ఆసిఫాబాద్ మండలం నూర్‌నగర్‌కు చెందిన ఫర్జానా బేగం వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్నారు. వితంతు పింఛన్ ఇప్పించాలని కాగజ్‌నగర్ మండలం చింతగూడకు చెందిన డి.శాంత విన్నవించింది. ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడలోని పోచమ్మ దేవాలయానికి వెళ్లే దారిని కొంతమంది ఆక్రమించుకున్నారని, విచారణ చేపట్టి శాశ్వత రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. కోసిని గ్రామ పంచాయతీలో శ్మశానవాటిక నిర్మాణ పనులు పూర్తి చేశానని, బిల్లులు ఇప్పించాలని చింతలమానెపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన దంద్రె శ్రీధర్ కోరాడు. వంశపారపర్యంగా వచ్చిన పట్టా భూమిని కొందరు ఆక్రమించుకుని పట్టా మార్చుకున్నారని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఆసిఫాబాద్ మండలం పర్శనంబాలకు చెందిన తానుబాయి కోరింది. తనకు తెలియకుండా పట్టా భూమిని వేరే వ్యక్తులు పట్టా మార్చుకున్నారని, విచారణ చేపట్టాలని తిర్యాణి మండలం కోయతలండికి చెందిన పెట్టం రాజలింగు కోరాడు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఉద్యోగం ఇప్పించాలి



మా తండ్రి పైకురావును 1990లో మావోయిస్టులు హత్య చేశారు. మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగావకాశం కల్పించింది. నాకు ఇప్పటివరకు ఎలాంటి ఉద్యోగం కల్పించడం లేదు. నా వయస్సు దాటిపోయి, నా కుమారుడు మేజర్ అయినప్పటికీ స్పందన లేదు. నాకుగానీ.. కుమారుడికిగానీ అర్హత ప్రకారం ప్రభుత్వ ఉద్యోగం కల్పించి పరిహారం చెల్లించాలి.

– కొట్నాక కిషన్‌రావు, గుండాద, మం.వాంకిడి

పెంకుటింట్లో ఉంటున్నాం



నేను నిరుపేదరాలిని. పెంకుటింట్లో ఇబ్బందిగా కాలం వెల్లదీస్తున్నాం. ఇందిరమ్మ ఇల్లు కోసం గతంలో రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటికైనా నా ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

– దుప్ప శాంత, చింతగూడ, మం.కాగజ్‌నగర్

సీసీరోడ్డు వేయాలి



ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామంలోని కుమ్మరివాడలో సీసీరోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురదతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. గ్రామంలోని అన్ని రోడ్లు సీసీగా మార్చారు. మా కాలనీకి మాత్రం సరైన రోడ్డు వేయడం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– బూర్గుడ గ్రామస్తులు, మం.ఆసిఫాబాద్

ఐదేళ్లుగా తిరుగుతున్నాం



‘మేము ఐదేళ్లుగా వితంతు పింఛన్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. నిరుపేదలైన మాకు ఉపాధి కష్టంగా ఉంది. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి..’ అని కౌటాల మండలం శివలింగాపూరానికి చెందిన తులసీ, భూదేవి, బుర్స వనిత, నాయిని వనిత, పలువురు మహిళలు కోరారు.

రేషన్‌కార్డులు ఇప్పించాలి



‘మేమంతా ట్రాన్స్‌జెండర్లం. రేషన్‌కార్డులు లేక ఇబ్బందులకు గురవుతున్నాం. గతంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదు. చదువుకున్నా ఉద్యోగాలు లేవు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇప్పించి ఆదుకోవాలి.’అని కాగజ్‌నగర్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్లు తేజస్విని, అక్షర, భారతి, రవళి, సాగరిక కోరారు.

ప్రాణహిత పరవళ్లు



విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత పరవళ్లు తొక్కుతోంది. వరద నీటితో కళకళలాడుతోంది. తెలంగాణ జీవనది ప్రాణహిత వర్షాలు లేక గత కొద్దిరోజుల క్రితం వరకు సాధారణంగా కనిపించింది. స్థానికంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడుగా ఎగువన మహారాష్ట్రలోనూ భారీ వర్షాలతో చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. రానున్న రోజుల్లో భారీ వర్షాలతో మరింత వరద వచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. సోమవారం ఓ వైపు ఆకాశం మేఘావృతమై ఉండగా.. చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద కనిపించిన సుందర దృశ్యమిది.. - చింతలమానెపల్లి

క్లుప్తంగా

శాంతినగర్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న బొల్లు శ్రీరామ్ ఈనెల 3న తన స్వగ్రామం భోరజ్ మండలంలోని కోర్టకు వెళ్లారు. ఆదివారం అదే కాలనీకి చెందిన జుబేర్ అనే వ్యక్తి శ్రీరామ్‌కు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయన్నాడు. ఇంటికి వచ్చి బీరువాను పరిశీలించగా అందులో ఉంచిన 2 తులాల బంగారంతో పాటు రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు సోమవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

భార్యను హత్యచేసిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: భార్యను హత్యచేసిన నిందితుడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన హింగోలి శంకర్ ఈనెల 2న తన భార్యను తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి బండరాళ్లతో కొట్టి చంపాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

విషపు మొక్కలు తిని 70 గొర్రెలు మృత్యువాత


మృతిచెందిన గొర్రెలు


పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి శివారులో విషపు మొక్కలు తిని 70 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. కౌటాల మండలంలోని శీర్షా గ్రామానికి చెందిన లీలయ్య, శంకర్, భీరయ్య గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం పెంచికల్‌పేట్ మండలంలో గొర్రెలను మేపటానికి వలస వచ్చారు. సోమవారం పంచపూల మొక్కలను తిన్న 70 గొర్రెలు మృతి చెందాయి. యజమానులు ఇచ్చిన సమాచారంతో పశువైద్యాధికారి రాకేష్ తీవ్ర అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స అందించారు. గొర్రెలు చనిపోవడంతో ఉపాధి పోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని యజమానులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు..


మృతిచెందిన గొర్రెలు

లోకేశ్వరం: మండలంలోని గడ్చాందలో ఏర్రోల్ల భోజన్నకు చెందిన గొర్రెల మందపై సోమవారం కుక్కలు దాడి చేయడంతో 15 మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఆదివారం రాత్రి గొర్రెలను పాకలోకి తోలాడు. సోమవారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేయడంతో గొర్రెల అరుపులు విని వెళ్లి చూడగా అప్పటికే 15 జీవాలు మృతి చెందాయి. గొర్రెల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

గేట్లను ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు



‘మత్తడివాగు’ రెండు గేట్లు ఎత్తివేత

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మత్తడివాగు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు రావడంతో నిండుకుండలా మారింది. ఇన్‌ఫ్లో ద్వారా 697 క్యూసెక్కుల వరదనీరు రాగా అధికారులు ముందు జాగ్రత్తగా ఆదివారం రాత్రి రెండు గేట్లను ఎత్తి 604 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం 276.30 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ హరీష్ కుమార్ తెలిపారు. – తాంసి

జలకళ సంతరించుకున్న పెద్దగుండం జలపాతం



‘పెద్దగుండం’కు జలకళ

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కోకస్మన్నూర్ అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దగుండం జలపాతం జలకళ సంతరించుకుంది. ఇచ్చోడ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో చుట్టూ గుట్టల మధ్య సహజసిద్ధంగా ఈ జలపాతం ఏర్పడింది. దాదాపుగా 30 అడుగుల ఎత్తునుంచి నీరు ఎగిసి గుండంలోకి పడుతుండడంతో వచ్చే హోరుమనే శబ్దం చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. – ఇచ్చోడ

9 నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు


స్టేడియాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రాజు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి 12 వరకు బాలికల జూనియర్స్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొననున్నారని, వారికి వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, వొడ్నాల శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రుయ్యాడిలో ముగిసిన మొహర్రం వేడుకలు

- అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన హస్సేన్ హుస్సేన్ దేవస్థానం


పూజలు చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


పీరీల ఊరేగింపును తిలకిస్తున్న భక్తులు

తలమడుగు: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయ్యాడిలో హస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో ఏర్పాటు చేసిన పీరీలకు రాష్ట్రంలోనే ప్రత్యేకత ఉంది. ఇక్కడి పీరీలు మహిమగలవని భక్తుల నమ్మకం. సోమవారం చివరిరోజు మొహర్రం వేడుకలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భారీగా తరలివచ్చారు. దీంతో దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించి పీరీలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తులను అడిగి పీరీల విశిష్ఠతను తెలుసుకున్నారు. సాయంత్రం దేవస్థానం ఎదుట ఉన్న గుండం చుట్టూ డప్పువాయిద్యాలతో తిరుగుతూ అసైదులా హారతి అంటూ ఆటలు ఆడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులు జిల్లా కేంద్రం నుంచి రుయ్యాడి గ్రామానికి ప్రత్యేక బస్సులు నడిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, నాయకులు జీవన్‌రెడ్డి, గంగాధర్, సుదర్శన్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సీసీవో శ్రీనివాస్, గంగన్న, దత్తాత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల అరెస్ట్

- నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్‌ను విక్రయించిన సర్కారు ఉద్యోగులు
- వన్‌టౌన్‌లో కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: గతంలో నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్ విక్రయించిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన ఠాకూర్ రూపారాణి భర్త ఠాకూర్ రవీందర్ సింగ్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ విభాగంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసేవారు. ఈ క్రమంలో అతనికి కొండూరి గంగాధర్ అనే నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగి పరిచయమయ్యాడు. గంగాధర్ జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 346, ప్లాట్ నంబర్ 179, అటెండర్స్ కాలనీలోని ఎంప్లాయిమెంట్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దేవల్ల గోవర్ధన్ పేరు మీద ఒక ప్లాటు అమ్మకానికి ఉందని రవీందర్ సింగ్‌కు తెలిపాడు. నిజానికి ఈ ప్లాటు 1996లో ప్రభుత్వం తహసీల్దార్ ద్వారా అమీరుద్దీన్ అనే వ్యక్తికి కేటాయించినట్లుగా రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. అయితే 2006లో రూపారాణి, ఆమె భర్త ఆ ప్లాటుకు కె.గంగాధర్, డి.గోవర్ధన్ సమక్షంలో రూ.65 వేలు చెల్లించారు. 2006 నవంబర్ 10న కె.గంగాధర్ మధ్యవర్తిత్వం వహించి దేవల్ల గోవర్ధన్‌తో అమ్మకపు ఒప్పందం చేయించాడు. తరువాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నంబర్ 4433/06 ప్రకారం రూపారాణి పేరు మీద ప్లాటు రిజిస్టర్ అయింది. రుపారాణి భర్త ఠాకూర్ రవీందర్‌సింగ్ బదిలీ కావడంతో వారు నిర్మల్‌కు మారారు. ఆదిలాబాద్‌కు వచ్చినప్పుడల్లా తమ ప్లాటును చూసుకునేవారు. అయితే ఇటీవల ఆ ప్లాటు వాస్తవానికి అమీర్‌ఖాన్ కుమారుడు అహ్మద్ ఖాన్‌కు చెందినదని గుర్తించారు. నకిలీ పట్టా పత్రాలను అసలు పత్రాలుగా చూపించి తమను మోసం చేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ పోలీసులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించిన మరింత సమాచారం దర్యాప్తు పూర్తయిన తర్వాత వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు. ఇదివరకే ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కొండూరి గంగాధర్‌పై కేసు నమోదైందని, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కేసులో ప్రస్తుతం కె.గంగాధర్, డి.గోవర్ధన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీలో కౌన్సెలింగ్ షురూ


అడ్మిషన్ పత్రం అందిస్తున్న వీసీ గోవర్ధన్

బాసర: 2025–26 విద్యాసంవత్సరానికి గానూ బాసర ఆర్జీయూకేటీ, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో ప్రవేశానికి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీధర్‌తో కలిసి సంగారెడ్డి జిల్లా కామోల్ గ్రామానికి చెందిన మొదటి ర్యాంక్ సాధించిన గడ్డం వర్షికకు తొలి అడ్మిషన్ పత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది మొత్తం 1,690 మందికి ప్రవేశాలు కల్పించనుండగా ప్రతీరోజు 564 మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నామని అధికారులు తెలిపారు. సోమవారం 500 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు కన్వీనర్‌గా డా.చంద్రశేఖర్, కో కన్వీనర్లుగా డా.దేవరాజు, బండి హరికృష్ణ, సభ్యులుగా డా. విట్టల్, డా.భవ్‌సింగ్ వ్యవహరిస్తున్నారు. విశ్వవిద్యాలయ పీఆర్‌ఓగా డా.విజయ్ కుమార్ పాల్గొన్నారు. గైర్హాజరైన విద్యార్థుల స్థానాలను త్వరలోనే వెయిటింగ్ లిస్టు ఆధారంగా భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ట్రాప్ కెమెరాల ఏర్పాటు

బోథ్: సొనాల మండలంలోని ఘన్‌పూర్ అడవుల్లో ఇటీవల ఓ ఆవును చంపిన గుర్తు తెలియని జంతువును పులిగా భావిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు సంబంధిత ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా పులి పాదముద్రలు లభ్యం కాలేదు. అయితే ఇటీవల రఘునాథ్‌పూర్ అడవుల్లో పులి ట్రాప్ కెమెరాకు చిక్కడంతో అధికారులు అప్రమత్తమై సోమవారం ఘన్‌పూర్ అడవుల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాగా ఆవును పులి చంపిందని ఎలాంటి ఆధారాలు లేవని ఎఫ్ఆర్‌వో ప్రణయ్ పేర్కొన్నారు.

రిటైర్డ్ సీఐ హఠాన్మరణం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనిషా తండ్రి, రిటైర్డ్ సీఐ లచ్చన్న సోమవారం ఉదయం హఠన్మరణం చెందారు. 1980లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరిన ఆయన 1999లో ఆదిలాబాద్‌రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా, 2011లో వాంకిడి సీఐగా బాధ్యతలు చేపట్టారు. 2014లో ఉద్యోగ విరమణ పొందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

మందమర్రిరూరల్: జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు రామన్‌కాలనీకి చెందిన లారీ డ్రైవర్ కటకం శ్రీనివాస్ (45)15 సంవత్సరాల క్రితం జరిగిన ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి పనిచేయలేని స్థితికి చేరుకున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య రమ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు..

దండేపల్లి: మద్యానికి బానిసై ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన మనుపాట రాజయ్య (74)కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం మద్యం సేవించి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. పక్కింట్లో ఉంటున్న ఎద్దు సురేశ్ సోమవారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రాజయ్య మామిడితోటలో చెట్టుకు ఉరేసుకున్నాడని సమాచారం ఇచ్చాడు. మృతుని కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై..

కుభీర్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోచోటు చేసుకుంది. ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పార్డి(బి)గ్రామానికి చెందిన తోట రమేశ్ (34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం మద్యం మత్తులో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో గల మెట్రో ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌లో బాలుడి(14)ని పనిలో పెట్టుకున్న యజమాని నజీమ్ మోయినొద్దీన్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ బృందం తనిఖీ చేయగా బాలుడితో పనులు చేయిస్తూ కనిపించారని ఆయన పేర్కొన్నారు. దీంతో ముస్కాన్ బృందం ఇన్‌చార్జి శంకర్ గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


గణేశ్ (ఫైల్)

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన నానవేణి గణేశ్ (30) వాంకిడిలో బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా నాలుగు వరుసల జాతీయ రహదారి–363పై టోల్‌ప్లాజా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ముందుగా ఆసిఫాబాద్ ఆస్పత్రిలో ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య రవళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుర వసతిగృహం తనిఖీ


సరుకులు పరిశీలిస్తున్న అధికారి దుర్గాప్రసాద్

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహాన్ని సోమవారం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. ఉదయం అల్పాహారం (టిఫిన్) ఉప్మా పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సరుకుల నాణ్యతను, రికార్డులను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన భోజనం వేడివేడిగా రుచికరంగా విద్యార్థులకు అందించాలని వసతిగృహ సంక్షేమాధికారి, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ సోషల్ ఆఫీసర్ రవీందర్, వసతిగృహ సంక్షేమాధికారి కుమారస్వామి ఉన్నారు.

వేధింపులకు పాల్పడిన యువకులకు కౌన్సెలింగ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పాఠశాల విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు యువకులకు షీటీం సభ్యులు స్వప్న, రజని, దినేశ్ సోమవారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే షీటీం నంబర్ 8712670564, లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు, ప్రిన్సిపాల్ రామ్‌దాస్ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలకు కొత్త సాఫ్ట్‌వేర్

పాతమంచిర్యాల: వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించేందుకు పోస్టల్ శాఖలో కొత్త సాఫ్ట్‌వేర్ ఐటి 2.0 అప్లికేషన్ ప్రవేశపెడుతున్నట్లు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 మంగళవారం నుంచి కొత్త సాఫ్ట్‌వేర్ సేవలు అందుబాటులోకి రానున్నాయని, దీంతో జిల్లా కేంద్రంలోని సార్టింగ్ (డిస్ట్రిబ్యూషన్) కార్యాలయంలో లావాదేవీలు జరగవన్నారు. పార్సిల్‌లు, ఉత్తరాలు సార్టింగ్ కార్యాలయం నుంచి బట్వాడా కావన్నారు.

మత్స్యకారుల సొసైటీల్లో నగదు జమ చేయాలి


మాట్లాడుతున్న లెల్లెల బాలకృష్ణ

పాతమంచిర్యాల: తెలంగాణ మత్స్యకారుల సొసైటీలలో చేప, రొయ్య పిల్లల కొనుగోలు కోసం ప్రభుత్వం నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో మత్స్యకారుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చేప, రొయ్య పిల్లల పంపిణీపై నిర్దిష్టమైన ప్రకటన చేయకపోవడంలో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారన్నారు. చేప, రొయ్య పిల్లల కొనుగోలు కోసం ఎలాంటి టెండర్లు లేకుండా నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీసీ, ఎన్ఎఫ్‌డీబీ నిధులను ఎత్తివేయడాన్ని నిరసిస్తూ మత్స్యకారులు జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోడెంకి చందు, నాయకులు బోడెంకి మహేష్, కంపల చంద్రయ్య, పిట్టల దశరథం, మంచర్ల రాజేందర్, జిల్లాల శ్రీనివాస్, జనుగరి నారాయణ, డోకే సమ్మయ్య, నాగుల మహేష్, బోగుట వెంకటేష్, రైతు సంఘం అధ్యక్షుడు సంకె రవి, తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ, బీఆర్ఎస్‌ల అసత్య ప్రచారాలు తిప్పికొట్టాలి’


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

జన్నారం: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్ఆర్ఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన జన్నారం, దస్తురాబాద్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేసిన పాపం వల్లే నేడు రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. అందరికీ రేషన్ కార్డులు అందించి ఉంటే నేడు రూ.2లక్షల వరకు రుణమాఫీ అయ్యేదన్నారు. బీజేపీ ప్రభుత్వం యూరియా కొరత సృష్టించి రైతులకు తీవ్రం అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్‌లు రవి, రమేశ్‌రావు, జన్నారం, దస్తురాబాద్ మండలాల ముఖ్య నాయకులు ముజాఫర్ అలీఖాన్, పంకజ, సుభాష్‌రెడ్డి, శంకరయ్య, ఇసాక్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా కేసులపై ఆరా


రోగితో మాట్లాడుతున్న డీడీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చిన మహారాష్ట్రలోని సిరొంచ, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరికి మలేరియా సోకినట్లుగా వైద్యులు నిర్ధారించారు. మంచిర్యాల ఉపవైద్యాధికారి డాక్టర్ అనిత సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని జ్వరాల వార్డులో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులతో మాట్లాడి వివరాలను సేకరించారు. జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాలేదని, ఇతర జిల్లాల నుంచి మంచిర్యాలకు వచ్చి చికిత్స పొందుతున్నారని ఆమె పేర్కొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: డీసీఈబీ ఆధ్వర్యంలో పరీక్షలు, కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. సోమవారం డీసీఈబీ కార్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరంలో ఉమ్మడి పరీక్షల నిర్వహణ బోర్డు మొదటి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి అభిప్రాయాలు తీసుకుని వాటికి అనుగుణంగా వర్క్‌షాప్‌లు నిర్వహించడం, ఎలాంటి తప్పులు లేకుండా పరీక్ష ప్రశ్న పత్రాలు రూపొందించడం, నాణ్యమైన ప్రశ్న పత్రాలు ముద్రితం, సమ్మెటివ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీసీఈబీ సెక్రెటరీ మహేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీ వేణుమాధవ్, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, డీఎస్‌వో మధుబాబు, ఎంఈవో, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

బెల్లం, పటిక పట్టివేత


బెల్లం, పటిక, నిందితుడితో అధికారులు

ఖానాపూర్: ఖానాపూర్ నుంచి బీర్నందికి ఆటోలో అక్రమంగా పటిక, బెల్లం తరలిస్తున్న కే.రాజ్‌కుమార్‌ను సోమవారం అరెస్టు చేశామని ఎక్సైజ్ ఎస్సైలు అభిషేకర్, వసంత్‌రావు తెలిపారు. నిందితుని వద్ద నుంచి ఆటోతో పాటు 110 కిలోల బెల్లం, 20 కిలోల పటికను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్, హరీశ్, నరేందర్ పాల్గొన్నారు.